విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 23, ఆగస్టు 2025

దివ్యాంగ పింఛన్లలో అర్హులకు అన్యాయం జరగదు

ఎమ్మెల్యే బండారు శ్రావణి

విశాలాంధ్ర–శింగనమల : పింఛన్ల రద్దుపై ప్రజలకు అనవసరమైన భయాందోళనలు కలిగిస్తూ ప్రతిపక్ష పార్టీలు తప్పుదారి పట్టించే ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే బండారు శ్రావణి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, వికలత్వం 40 కంటే ఎక్కువ శాతం ఉన్నవారి పెన్షన్లు యథావిధిగా కొనసాగుతాయని. తాత్కాలిక డీజేబిలిటీ సర్టిఫికేట్ ఉన్న వారి పేర్లను ఎన్ ఎస్ పెన్షన్ పోర్టల్‌లో రద్దు జాబితా నుంచి తొలగించడం జరిగిందన్నారు. అసలు సదరం సర్టిఫికేట్ జెనరేట్ కాని కొందరు మాత్రమే పెన్షన్ రద్దు అవుతుందని, ఇది ప్రభుత్వ విధానంలో నిబంధన స్పష్టంగా ఉన్నదన్నారు. పెన్షన్ రకం మార్పు చేసినవారికి కొత్తగా ఎంచుకున్న పెన్షన్ రకం ప్రకారం అమౌంట్ అందుతుందని,రద్దయిన వారిలో విడో పెన్షన్ అర్హత కలిగిన వారికి ఎంపీడీఓ లాగిన్‌లో అప్పీల్ తర్వాత పెన్షన్ రకం మార్చే అవకాశం కల్పించబడుతుందని మా ప్రభుత్వం ఎప్పుడూ అర్హులైన ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూసుకుంటుందన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలకు కదలిన ఎర్రదండు

విశాలాంధ్ర–బ్యూరో అనంతపురం: సీపీఐ రాష్ట్ర మహాసభలు శనివారం నుండి ఒంగోలు నగరంలో ప్రారంభమవుతున్న సందర్భంగా అనంతపురం జిల్లా నుండి వందలాది మంది రెడ్ షర్ట్స్ ఎర్రదండు సైన్యం శుక్రవారం బయలుదేరి వెళ్లింది. జిల్లా వ్యాప్తంగా రాత్రికి సీపీఐ కార్యకర్తలు, అన్ని అనుబంధ సంఘాల సభ్యులు అనంతపురం చెరువు కట్ట వద్దకు చేరుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి వందలాది మంది సిపిఐ కార్యకర్తల నినాదాల మధ్య ఎర్ర జెండా ఊపి బస్సుల ర్యాలీని ప్రారంభించారు., అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర మహాసభలు శనివారం నుండి ప్రారంభమవుతున్న సందర్భంగా జిల్లా నలుమూలల నుండి ప్రతినిధులు,వందలాది మంది రెడ్ షర్ట్స్ వాలంటీర్లు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా తరలివెళ్ళడం జరుగుతుందని ఇదే ఉత్సాహంతో సీపీఐ చేపట్టే ప్రజా సమస్యలపై కూడా ఉత్సాహము కనబర్చా లని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం సీపీఐ నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తలారి నారాయణస్వామి, ఎ.పద్మావతి జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రమణయ్య సంతోష్‌కుమార్, శ్రీశైలం రాజేష్‌గౌడ్, ఈ.కుల్లాయిస్వామి, రాప్తాడు నియోజక వర్గ సహాయ కార్యదర్శి నీళ్లపాల్ల రామకృష్ణ, బుక్కరాయ సముద్రం మండల కార్యదర్శి బండి రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంత రాయుడు, నగర సీపీఐ సహాయ కార్యదర్శి వి.కృష్ణుడు, అనంతపురం నగర కార్యవర్గ సభ్యులు మున్నా, చిత్రచేడు రామాంజనేయులు, అల్లీపీరా, రైతు సంఘం నాయకులు పబలకుంట వన్నారెడ్డిలు వందలాది మంది రెడ్ షర్ట్ వాలంటీర్లు, అనంతపురం రాప్తాడు, సింగనమల సిపిఐ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు.

జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో జిల్లా మొదటిస్థానంలో ఉండాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర–అనంతపురం: ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం అమలులో జిల్లా మొదటిస్థానంలో ఉండేలా పని చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, అధికారులను ఆదేశించారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కేంద్ర ప్రభుత్వం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకంపై పోర్టల్ ప్రదర్శన నిర్వహించారు. అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ సురేష్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పలు ఆదేశాలిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద గుంతకల్లు మండలంలోని గుండాల తాండా, వజ్రకరూరు మండలంలోని వెంకటంపల్లి చిన్నతాండా, వెంకటంపల్లి పెద్దతండా మరియు సింగనమల మండలంలోని నాగులగుడ్డం, నాగుల గుడ్డం తాండా గ్రామాలు ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద ఎంపిక చేసిన గ్రామాల్లో 20 శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టాలని డీటీడబ్ల్యుఓను ఆదేశించారు. జిల్లాలో ఇతర గ్రామాలలో అభివృద్ధి పనులు చేయాల్సి ఉన్నా అందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడంలో జిల్లా ముందంజలో నిలిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వరి సాగులో మెళకువలు పాటించాలి

విశాలాంధ్ర–శింగనమల: అగ్రికల్చర్ టెక్నీకల్ మేనేజ్మెంట్ ఏజెన్సీ (ఆత్మ) కింద వరి పంట సాగు మెలకువలు గురించి రాచేపల్లి వరి సాగు రైతులకు శిక్షణా కార్యక్రమం శుక్రవారం ఏ.ఓ,అన్వేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి అనంతపురం రైతు శిక్షణ సెంటర్ నుండి వ్యవసాయ అధికారి నరసింహులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాచేపల్లిలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద బీపీటీ 2846 రకం వడ్లు ఫౌండేషన్ సీడ్ సరఫరా చేయటం జరిగిందని, ఈ రకం అగ్గి తెగులు, సుడి దోమను తట్టుకుంటుందని, పంట కాలం 145 రోజులని, వరి పొలంలో తూర్పు పడమర దిశలో ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు కాలి బాటలు ఏర్పాటు చేసుకోవటం వల్ల గాలి వెలుతురూ బాగా తగిలి పురుగు తెగులు ఉధృతి తగ్గుతుందన్నారు. సుడి దోమ నివారణకు కార్బోఫురాన్ 3జి గుళికలు 10కిలోలు ఎకరాకి వేయాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, రాచేపల్లి రైతు సేవా కేంద్రం వీహెచ్ఎ రమేష్, రైతులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర–నార్పల : మండలంలో ఈనెల 27వ తేదీ వినాయక చవితి ఉత్సవాల్లో పోలీసుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని శుక్రవారం ఎస్సై సాగర్ పేర్కొన్నారు. వినాయక మండపాలను రహదారులకు అడ్డంగా ఏర్పాటు చేయరాదని, విగ్రహాల వద్ద రాత్రులు మనిషి కాపలా ఏర్పాటు చేయాలన్నారు. అట్లాగే విద్యుత్ శాఖ వారి అనుమతి కూడా తీసుకోవాలన్నారు. గణపతి విగ్రహం 3 రోజులు కంటే ఎక్కువ రోజులు పెట్టరాదని, అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేస్తే డీజేలను సీజ్ చేసి పోలీస్ పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామన్నారు. ఊరేగింపు సమయంలో గొడవలు జరగకుండా చూడాలని,గణేష్ మండపాల వద్ద టపాకాయలను, సామగ్రిని ఉంచరాదు. అత్యవసర దీపం అందుబాటులో ఉంచుకోవాలి.

నేడు మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలు

విశాలాంధ్ర–అనంతపురం : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు శారదా మున్సిపల్ ఉన్నత పాఠశాల, అనంతపురంలో మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ పి.వి.కిషోర్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి 6 వతరగతి నుండి 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనుటకు అర్హులని, విగ్రహాల తయారీకి అవసరమైన బంకమట్టిని, నీటిని సమకూర్చుతామని తెలియచేశారు. చిన్నారులలో పర్యావరణ స్పృహను పెంచే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలియచేశారు.

కాంగ్రెస్ మండల కమిటీల ఏర్పాటు

విశాలాంధ్ర–కళ్యాణదుర్గం : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆదేశాలతో కళ్యాణదుర్గం నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీలను శుక్రవారం ప్రకటించారు. కళ్యాణదుర్గం పట్టణ అధ్యక్షులుగా మాల ఈశ్వర్ ప్రసాద్,కళ్యాణదుర్గం రూరల్ మండల అధ్యక్షుడిగా దురదకుంట తిమ్మరాజు, కంబదూరు మండల కమిటీ అధ్యక్షుడిగా చెన్నంపల్లి మధుసూదన్, కుందుర్పి మండల కమిటీ అధ్యక్షుడిగా మర్రిస్వామి, శెట్టూరు మండల కమిటీ అధ్యక్షుడిగా ములకలేడు గోవిందప్ప, బ్రహ్మసముద్రం మండల కమిటీ అధ్యక్షుడిగా యర్రగొండాపురం గొల్ల కృష్ణమూర్తిని నియమించారు.

ఎస్సై నాగమధుకు సన్మానం..

విశాలాంధ్ర–కణేకల్లు: ఆగస్టు 15న అనంతపురం పోలీస్ గ్రౌండ్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కణేకల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ నాగమధుకు "ఉత్తమ ఎస్సై" అవార్డును రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ ప్రదానం చేశారు. ఈ మేరకు ఆయన్ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, బీజేపీ పార్టీ నాయకులు అందరూ కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ఈరోజీ రావు, కణేకల్ మండల అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు నాగరాజు, క్రాంతికుమార్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో పెచ్చుమీరిన దౌర్జన్యాలు

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం : సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని అనంతపురం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు బరితెగించి మహిళల పట్ల కూడా అనుచితంగా మాట్లాడటం చూస్తున్నాం. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జూనియర్ ఎన్టీఆర్ పైన దారుణమైన వ్యాఖ్యలు చేశారు. గతంలో చంద్రబాబు సతీమణి పై ఎవరో వ్యాఖ్యలు చేశారంటూ పెద్ద ఎత్తున యాగీ చేసిన చంద్రబాబుకు సొంత బావమరిది హరికృష్ణ సతీమణిపై సాక్షాత్తు టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నాలుగైదేళ్ల కిందట సోషల్ మీడియా లో మహిళల పట్ల పోస్టులు పెట్టారంటూ రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లను వెదికి వెదికి పట్టుకుని, జైళ్ళ పాలు చేశారు. మరి మీ పార్టీలోనే ఎమ్మెల్యేలు మీ కుటుంబంలోని ఒక మహిళ పట్ల ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఎందుకు కఠినంగా స్పందించడం లేదో చంద్రబాబే చెప్పాలన్నారు. సీఎం అండతోనే టీడీపీ ఎమ్మెల్యేలు చెలరేగిపోతున్నారు. అని పేర్కొన్నారు. జూనియర్ ఎన్టీఆర్ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సాటి నటుడిగా పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు.

కళ్యాణదుర్గం మున్సిపాల్టీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

సలహాలు, సూచనలు కోరిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర–కళ్యాణదుర్గం: గడిచిన ఐదేళ్లలో వైసీపీ నాయకులు అరాచక పాలనతో కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ఎక్కడపడితే అక్కడ భూముల కబ్జా, ఆక్రమణలు చేయడమే కాకుండా ఒక్కో స్థలాన్ని ఇద్దరికీ, ముగ్గురికి అమ్ముకున్నారని అలాంటి వారిని దూరంగా పెట్టాల్సిన బాధ్యత మనందరిపైన ఉంటుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధి 2047ను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్‌పై సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు శుక్రవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమణలు చేసే వారిని అడ్డుకోవాలని, పట్టణ అభివృద్ధికి ఎవరు ఎలాంటి సూచనలు అయిన చేయవచ్చని, కళ్యాణదుర్గం పట్టణంలో క్రీడా మైదానం కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని, 184 కోట్లతో పట్టణానికి శాశ్వత తాగునీటి పరిష్కారం చేస్తామని, పట్టణంలో ఇంటర్నల్ రహదారులతో పాటు ప్రధాన రహదారులు, ఔటర్ రింగ్ రోడ్డులు ఏర్పాటు అవసరముందని, 2047 దృష్టిలో పెట్టుకుని పట్టణ ప్రణాళికలు తయారు చేస్తు న్నామని, 2012లో మున్సిపాలిటీగా మారిన అప్పటి పంచాయతీ రోడ్డులే నేటికీ వాటినే వినియోగిస్తున్నా మని, వైసీపీ నాయకులు ఐదేళ్లు పట్టించుకోకుండా ఎన్నికల ముందు సీసీ రోడ్లు అడ్డదిడ్డంగా వేసి వదిలేశారని, వరదలు వచ్చినప్పుడు అధికారులను పిలిచి మాట్లాడితే డ్రైనేజీ వేయాల్సిందని కానీ అక్రమణలు కారణంగా వేయలేదని చెప్పారన్నారు, అనేక రోడ్లు లేవు ఇదే విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రుల దృష్టికి తీసుకెళ్ళామని పురపాలక సంఘం మాస్టర్ ప్లాన్ పై ఎలాంటి అపోహలు ఉండకూడదని అందరిని పిలిచి వారి అభిప్రాయాలు తీసుకున్నారన్నారు. శ్రీరామిరెడ్డి కార్మికులకు రెండేళ్ల జీతాలు మా ప్రభుత్వం వచ్చాక 25 కోట్లు అందించామని గుర్తు చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ ప్రసాద్, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సరే.. బస్సు షెల్టర్ ఎక్కడ ..?

విశాలాంధ్ర–నార్పల : బస్సు మహిళకు ఉచితం ఉన్నా ప్రయాణికులకు మండలంలో బస్ షెల్టర్ లేకుండా పోయింది. మహిళలకు ఉచిత బస్సు పథకం ఉండడం మహిళా ప్రయాణికులు బస్టాండ్ ప్రాంతం రద్దీ ఉండడంతో ప్రయాణికులు కూర్చోవడానికి సదుపాయం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ బస్సు నిలిపి ఉంచే ప్రాంతాన్ని బస్సు బదులు ప్రయాణికులు నిలిచి ఉండే ప్రాంతం అని అర్థం చేసుకోవాలి. మండలంలో బస్సు ఎక్కడానికి రోడ్డుపైనా దుకాణాల చెంత నిలబడి ఉండాలి.దీనికి తోడు వర్షాకాలం కావడంతో బస్సు షెల్టర్లు లేక ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూస్తూ తడవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రయాణికులు పలుమార్లు ఫిర్యాదు చేసిన ప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఉదాసీనత కారణంగా ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. మరో వైపు రోడ్డుపై బస్సులు నిలవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి బస్టాండ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అన్నదమ్ముల మధ్య భూ వివాదం

౬౦౦ వక్క చెట్ల నరికివేత

విశాలాంధ్ర–కళ్యాణదుర్గం: అనంతపురం జిల్లా కుందుర్పి మండలం పంచాయతీలోని నిజవల్లి పంచాయతీ, ఎన్.వెంకటంపల్లిలో అన్నదమ్ముల మధ్య భూ వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి 650 వక్కచెట్ల పై గొడ్డలి వేటు పడింది. అన్నదమ్ముల్లో ఒకరైన చిన్న వరదప్ప అతని కొడుకు కేశవరెడ్డి తమ పొలంలోని చెట్లపై పగ తీర్చుకుంటున్నాడని బాధిత రైతులు గోవిందరెడ్డిలు వాపోయారు. తమ మధ్య భూ వివాదం నెలకొన్నదని అయితే గతంలో అనేక దపాలుగా పంచాయితీలు చేసి తాము హక్కుగా పొందామని.. అయితే గత ఏడాది చిన్న వరదప్ప అతని కొడుకు కేశవరెడ్డి మా పొలంలో 200 చెట్లను నరికేశారని అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మరోసారి గురువారం రాత్రి 650 ఒక్క చెట్లను నరికేసారని కన్నీటి పర్యంతం అయ్యారు. వీటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని వెల్లడించారు. గ్రామంలో అన్నదమ్ముల మధ్య భూవివాదం కాకుండా పార్టీలుగా విభజించి తమను నష్టపరుస్తున్నారని బాధిత రైతులకు తెలిపారు. తమ సోదరుడు చిన్న వరదప్ప అతని కొడుకు కేశవరెడ్డిలు తరచూ తమపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుందుర్పి పోలీసులకు పిర్యాదు చేశారు.

రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్ల తొలగింపు దుర్మార్గం

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

విశాలాంధ్ర–ఉరవకొండ : కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త పింఛన్లు ఇవ్వకపోగా... ఉన్న దివ్యాంగ పింఛన్లను రీ వెరిఫికేషన్ పేరుతో తొలగించడం దుర్మార్గమైన చర్య అని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొనకొండ్ల గ్రామంలో తన స్వగృహంలో విలేకర్లసమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి తర్వాత రాష్ట్ర ప్రజలను ఎన్నో రకాలుగా ఇబ్బందులు గురిచేస్తోందన్నారు. ఎన్నికల హామీలో మాత్రం వికలాంగులకు రూ.6 వేలు పింఛను ఇస్తామని చెబితే సంబరపడ్డామని.. ఇప్పుడు నిర్ధాక్షణంగా దాదాపుగా రెండు లక్షల మందికి పెన్షన్లు తీసేస్తున్నారని మండిపడ్డారు. గతంలో 80 శాతం వైకల్యం ఉంటే ఇప్పుడు 40 శాతం ఉన్నట్లు చూపించి పింఛన్లు తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన వారికి కూడా మొండిచేయి చూపడం ఎంతవరకు సమంజసం అన్నారు. రీ వెరిఫికేషన్ పేరుతో ఆసుపత్రులకు, ఇతర కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీని వల్ల దివ్యాంగులు కార్యాలయాల మెట్లు ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని అర్హులైన దివ్యాంగులు అందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

ప్రారంభ దశలో ఉంటే క్యాన్సర్ నివారణ సాధ్యం...

డీఎంహెచ్ఓ డా.ఈ బి దేవి

విశాలాంధ్ర–అనంతపురం: కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జిల్లాలోని అనంతపురం మెడికల్ కళాశాల, సామాజిక ఆరోగ్య కేంద్రం, కళ్యాణదుర్గం మరియు ప్రాంతీయ ఆసుపత్రి గుంతకల్ నందు వైద్యాధికారులకు క్యాన్సర్ వ్యాధిపై శిక్షణ శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈ బి దేవి మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్‌పై పూర్తి అవగాహన వచ్చేలా నోరు, రొమ్ము గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై హాండ్స్ ఆన్ ట్రెనింగ్ ద్వారా స్పెషలిస్ట్ డాక్టర్లచే అవగాహన కార్యక్రమం నిర్వహించడమైనదని ఇందులో గైనకాలజీ, ఇఎన్ టి వైద్యులు రాజేష్, సర్జరీ స్పెషలిస్ట్ వైద్యులు అలాగే సెకండరీ హెల్త్ నుంచి దంత వైద్యులు శివకుమార్, స్త్రీ వ్యాధి నిపుణులు చంద్రకళ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ అనంతరం క్షేత్ర స్థాయి సర్వేలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటికి వెళ్ళి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అనుమానితులను ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆంకాలజీ ఓపినంబర్ 222 విభాగానికి రిఫరల్ సర్వీస్ ద్వారా పంపి తదుపరి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్ సోనియా వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్ సెకండరీ హెల్త్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ డేవిడ్, ఎన్‌సిడి ఆర్‌బీఎస్ కెజిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి, డా.రాజేంద్ర ప్రసాద్, స్పీన్ డిపార్ట్మెంట్. డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిడి సిబ్బంది ప్రేమ్, శ్రీరామ్ కిషోర్ మౌనిక శశికళ, సిహెచ్ఓ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలు

నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ రాక్స్ అండ్ మాల మహానాడు డాక్టర్ రత్నాకర్

విశాలాంధ్ర–అనంతపురం రూరల్ : ఎస్సీ వర్గీకరణ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల ఐక్యత విషయంలో కుట్రలు చేస్తున్నాయని నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ రాక్స్ అండ్ మాల మహానాడు డాక్టర్ రత్నాకర్ అన్నారు. అనంతపురంలోని ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాల సామాజిక వర్గంపై కక్ష సాధింపుతోనే ఎస్సీ వర్గీకరణ విషయంలో కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి తన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశంలో అన్ని రాజ్యాంగ వ్యవస్థల్ని మోడీ నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. మోడీకి దమ్ముంటే ఎలక్షన్లు రద్దు చేసి స్వతంత్రంగా బ్యాలెట్ పేపర్‌తో గెలిచి తన సామర్థ్యాన్ని నిరూపించుకోవాలన్నారు. కులాల, మతాల పేరుతో ప్రజలను విభజించి పాలించే పద్ధతిని బీజేపీ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ ఉపసంహరించుకునే వరకు శాంతియుత పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జూలకుంట కేశవ ప్రసాద్, పెద్దిరెడ్డిపల్లి అరవింద కుమార్, నల్లూరి శంకర్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా మెగా స్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర–గుంతకల్లు : పట్టణంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మవిభూషణ్ డాక్టర్ మెగాస్టార్ శ్రీ కొణిదెల చిరంజీవి సేవ స్ఫూర్తితో ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని గుంతకల్ నియోజకవర్గం చిరంజీవి యువత అధ్యక్షుడు పాండు కుమార్ అధ్యక్షతన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.మొదటగా మస్తానయ్య తాత దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. తర్వాత స్టాలిన్ సినిమా రిలీజ్ సందర్భంగా స్థానిక వాసవి థియేటర్ నందు అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ చేసి బాణాసంచా పేల్చారు. ఈ సందర్భంగా మెగా అభిమానులు, పాండు కుమార్ మాట్లాడుతూ సేవ అనే పదానికి స్ఫూర్తి ప్రదాత అయిన చిరంజీవి జన్మదిన అంటే మాకు ఒక పండగ లాంటిదని ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళు జీవిస్తూ మాకు స్ఫూర్తిని నింపుతూ ముస్ముందు మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గుంతకల్ నాయకులు పురుషోత్తం, పవర్ శేఖర్, ఎస్ కృష్ణ, మెగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మనూరు ఈశ్వర్‌ను కలిసిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు

విశాలాంధ్ర–గుత్తి: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాకం శ్రీకాంత్ ఆయన సోదరుడు రంగనాథ్ స్వగృహానికి శుక్రవారం విచ్చేసిన టీడీపీ యువ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్‌కు ఆర్యవైశ్య సంఘం సభ్యులు పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ మాకం శ్రీకాంత్ తో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న తరుణంలో పార్టీ బలోపేతానికి మీ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కల చెరువు ప్రతాప్, పట్టణ అధ్యక్షులు యం కె చౌదరి, హాస్పిటల్ కమిటీ సభ్యులు చికెన్ శీనా ప్రధాన కార్యదర్శి కలుగొట్ల కిషోర్ బాబు, 10వ వార్డు రవి, స్టోర్ డీలర్ వెంకట స్వామి, ఖాదీర్, శ్రీపురం సర్పంచ్ లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడు లక్ష్మీనారాయణ నాయుడికి నివాళులు

విశాలాంధ్ర–యాడికి: మండల కేంద్రంలోని శ్రీ చౌడేశ్వరి కాలనీలో నివాసం ఉంటున్న వైసీపీ నాయకుడు రమేష్ నాయుడు (చిట్టి నాయుడు) తండ్రి ఎద్దులపల్లి లక్ష్మీనారాయణ నాయుడు స్వర్గస్తులయ్యారన్న విషయం తెలుసుకొన్న వైసీపీ సీనియర్ నాయకులు బొంబాయి రమేష్ నాయుడు చిట్టి నాయుడు నివాసం చేరుకొని లక్ష్మీనారాయణ నాయుడు మృత దేహానికి పూలమాల వేసి సంతాపం తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు పామిశెట్టి నాగరాజు, దూద్ వలి, ఆది, హరీష్, పెద్దిరాజు, వినయ్ తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

ఎంటెక్, ఎంఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల

విశాలాంధ్ర–జేఎన్‌టీయూ: జవహర్లాల్ నెహ్రూ సాంకేతి విశ్వవిద్యాలయం ఎంటెక్, ఎం ఫార్మసీ పరీక్ష ఫలితాలును శుక్రవారం ఉపకులపతి ఆచార్య హెచ్. సుదర్శన రావు , రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. కృష్ణయ్య ఆదేశాలతో విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య వి. నాగ ప్రసాద్ నాయుడు విడుదలు చేశారు. జులై లో నిర్వహించిన పరీక్షలు ఎంటెక్ రెండవ సెమిస్టర్ (ఆర్ 21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఒకటవ,మూడవ.సెమిస్టర్ (ఆర్21) సప్లిమెంటరీ, ఏం.ఫార్మసీ రెండవ సెమిస్టర్ (ఆర్ 21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఒకటవ, మూడవ సెమిస్టర్ (ఆర్ 21) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను వెబ్సైట్లో పొందుపరిచినట్టు తెలిపారు.కార్యక్రమంలో కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎ.పి. శివకుమార్ అడిషినల్ కంట్రోలర్స్ ఆచార్య జి.శంకర్ శేఖర్ రాజు, డా.శ్రీధర్, డాక్టర్ ఎం.అంకారావు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయండి

కలెక్టర్ టి.ఎస్.చేతన్

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్యసాయి : నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ టి.ఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలసి స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర, స్వమిత్వా, ఈపిటిఎస్ డాక్యుమెంట్ అప్‌లోడ్, అన్నాదత సుఖిభవ, ఇ-క్రాప్ బుకింగ్, ఎలక్షన్స్ ఫారం 6, 7, 8, జిఎస్ డబ్ల్యూఎస్ స్టాఫ్ బయో మెట్రిక్ హాజరు వివిధ అంశాపై ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, నియోజక వర్గాలు, మండలాల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, పంచాయతీ సెక్రటరీలు మండల వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి హెచ్ఓ డీఈ పిటిఎస్ లాగ్ ఇన్ అయ్యి కరెక్ట్ డేటాను అప్లోడ్ చేయాలని, ఐఇపిటిఎస్‌లో డేటా అప్‌లోడ్ చేయడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే సిపిఓను సంప్రదించాలన్నారు. ఎలక్షన్ ఫార్మ్స్6,7,8 సంబంధించి ఈఆర్ఓలు, బియల్ఓల సమన్వయం చేసుకొని ఎప్పటికప్పుడు అప్‌లోడు చేసేలా ఆర్డిఓలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిఎస్ డబ్ల్యు ఎస్ స్టాఫ్ బయో మెట్రిక్ హాజరు పెంచాలని, ఈ క్రాప్ ఈకెవైసి పెండింగ్ లేకుండా విఆర్ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి చేయాలన్నారు. గ్రామ, పట్టణంలో ప్రతి రోజు ఇంటింటి నుండి చెత్త సేకరించాలన్నారు.ప్రతి 15 రోజులకు ఒక్కసారి తప్పని సరిగా ఓవర్ హెడ్ టాంక్స్‌ను క్లోరినేషన్ చేయాలని,పైపులు లీకేజీ లేకుండా చూడాలని, దోమలు నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు.

శ్రీకృష్ణుని బోధనలు ఆచరణీయం : మంత్రి సవిత

విశాలాంధ్ర-సోమందేపల్లి : భగవద్గీత అంటే కేవలం మతపరమైన గ్రంథమే కాదని, సమాజాన్ని సన్మార్గంలో నడిపే దిక్సూచి అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శ్రీకృష్ణుని బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని, ఆచరణీయమని వెల్లడించారు. సోమందేపల్లిలో శుక్రవారం నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ బీకే. పార్థసారధితో కలిసి మంత్రి సవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహా విష్ణువు ఎనిమిదో అవతారంగా శ్రీకృష్ణుని జన్మాష్టమి జరుపుకుంటామన్నారు. అధర్మంపై ధర్మానిదే తుది విజయమని శ్రీకృష్ణుని జననం బోధిస్తోందన్నారు. భగవద్గీత కేవలం మతపరమైన గ్రంథమే కాదని, కాలాతీతమైన జ్ఞానాన్ని, మానవాళికి కర్తవ్య బోధ, జీవిత సత్యాలను తెలియజేస్తోందని వెల్లడించారు. నేటి సమాజంలో భగవద్గీత పఠనం ఎంతో అవసరమని, శ్రీకృష్ణుని బోధనలు ఆచరణీయమని తెలిపారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడి బోధనల సారాంశాన్ని పలు కార్పొరేట్ సంస్థలు తమ కార్యకలాపాల్లో సైతం అనుసరిస్తుంటాయన్నారు.

మంచి విద్యతోనే భవిష్యత్తు.. ప్రతి ఒక్కరూ వారి పిల్లలను మంచి విద్యాబుద్ధులు నేర్పించాలని విద్యతోనే కుటుంబం, సమాజం, దేశం ఉన్నత స్థితికి చేరుతాయని బీసీ లందరూ రాజకీయంగా సామాజిక సాంఘికంగా ఆర్థికంగా విద్యాపరంగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. యాదవ కళ్యాణ మండపం కోసం మంత్రి సత్య కుమార్ ఐదు లక్షలు, మంత్రి సవిత తన తండ్రి పేరు మీద రూ.5.16 లక్షల పదహారు వేలు, ఎంపీ బి.కె పార్థసారథి నిధుల నుండి రూ. 20 లక్షలు, ముదిగుబ్బ ఆదినారాయణ లక్ష రూపాయలు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ కార్పొరేషన్ చైర్మన్ వెంకట శివుడు, మండల యాదవ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్య మహేష్ యాదవ్, మండల రైతు సంఘ అధ్యక్షులు హరికృష్ణ, శివశంకర్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, గోపాల్, అమర్నాథ్, సిపిఐ రాజగోపాల్, కలర్ శ్రీనివాసులు, ముత్యాలు, శివ, మారుతి, టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలకు తరలివెళ్లిన కామ్రేడ్స్..

విశాలాంధ్ర-కదిరి: సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలకు శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి కదిరప్ప, సీపీఐ పట్టణ కార్యదర్శి లియాకత్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు తరలివెళ్లారు. సిపిఐ శత వార్షికోత్సవాల మూడు రోజుల కార్యక్రమానికి కార్మిక సంఘం రమణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు మధు నాయక్, ఏఐఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర, సిపిఐ డీవిజన పవన్, సీపీఐ మండల కార్యదర్శులు శ్రీరాములు నాయుడు, చలపతి నాయుడు, ఎల్వి రమణ, కొండయ్య, ఆదెప్ప, రామచంద్ర, రెడ్డప్ప, మహిళా సంఘం నాయకురాలు విమలబాయ్, భవాని,సుధారాణి, మౌనిక జ్యోతి, ఇందిరమ్మ వెళ్లారు.

పెన్షన్ తొలగింపుపై ఆందోళన వద్దు

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : అర్హత కలిగిన ఏ లబ్ధిదారునికి పెన్షన్ ఆగిపోదని ప్రతి ఒక్క లబ్ధిదారునికి కూటమి ప్రభుత్వం పెన్షన్ అందజేస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి హామీ శుక్రవారం ఒక ప్రకటనలో హామీ ఇచ్చారు. సదరం మెడికల్ క్యాంపు రీ వెరిఫికేషన్‌లో నియోజకవర్గంలో సుమారు 1210 పెన్షన్లు రద్దు అయినట్లు అధికారులు ప్రకటించారని, వైసీపీ ప్రభుత్వ హయంలో ఫేక్ మెడికల్ సర్టిఫికెట్లతో చాలా మంది పెన్షన్లు పొందుతున్నారని ఆరోపణలు రావడంతో ప్రభుత్వం స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రభుత్వ అధికారులతో పెన్షన్ల పై రీ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కొన్ని లోపాల వల్ల అర్హులకు కొంత అన్యాయం జరిగి వుండవచ్చునని, అర్హులు స్థానిక ఎంపీడీవో వద్ద, మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకు వెళ్లి వచ్చే నెలలో పెన్షన్ మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు.

ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-ధర్మవరం : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని, ప్రతి పౌరునికి ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది అని ఆర్డిఓ మహేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ధర్మవరం, బత్తలపల్లి, ముదిగుబ్బ, తాడిమర్రి మండలాలలో 295 పోలింగ్ బూతులకు గాను 295 మంది బిఎల్ఓలను నియామించామని, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై చర్చించారు. ఎన్వి ఎస్‌టి యాప్, లేదా ఓటర్ హెల్ప్ యాప్ ద్వారా ఓటరు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుండి బీఎల్ ఏజెంట్ల జాబి తాలు తొందరగా ఆర్‌డీఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. డిప్యూటీ తాసిల్దార్ ఈశ్వరయ్య, సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డి, రాజ కుమార్, వైసీపీ, బిజెపి, సిపిఎం, జనసేన, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

విశాలాంధ్ర-ధర్మవరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. శుక్రవారం మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారం కోసం ఆయన 2వ రోజు పట్టణంలోని 21, 27,32,34 సచివాలయాలకు టీడీపీ నాయకులు అర్జీలతో వెళ్లారు. ఇందులో 27వ సచివాలయానికి శ్రీరామ్ స్వయంగా వెళ్లి.. ప్రజలు ఇచ్చిన అర్జీల గురించి చర్చించారు. ఇళ్లు, ఇంటి పట్టాలు, చేనేతల ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, పింఛన్లు వంటి దరఖాస్తులు ఎలాంటి తప్పిదాలు లేకుండా అప్ లోడ్ చేయాలన్నారు. అర్హులకు ఎక్కడా అన్యాయం జరగకూడదన్నారు. హౌస్ మ్యాపింగ్‌కు సంబంధించి త్వరలోనే ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు ప్రతి అర్జీ విషయంలో జవాబుదారీగా ఉండాలన్నారు.

మట్టి గణపతినే పూజించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని రక్షించాలని ఎంపీడీవో సాయి మనోహర్ తెలిపారు. శుక్రవారం వారు మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మట్టి గణపతిని పూజించే కరపత్రాలను, ఎంపీడీవో, అధికారులు, సిబ్బంది నడుమ విడుదల చేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ రసాయన మిశ్రమాల గణపతి విగ్రహాలను చెరువులలో కుంటలలో పడి వేయడం వల్ల పశువులతో పాటు చెరువు నీరు కూడా కాలుష్యం అవుతుందని తెలిపారు. కార్యాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏవో. అబ్దుల్ నబి,ఏపిఓ. సుధాకర్ సిబ్బంది సుబ్రమణ్యం వెంకటేష్ చౌదరి, ఎన్ ఆర్ ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు యూరియా, డీఏపీ ఎరువులను ఎరువు దుకాణ దారులు విక్రయించాలని ఆర్డీవో మహేశ్ తెలిపారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భౌతిక నిల్వల రిజిస్టర్‌లో ఉన్న వివరాలను సరిపోల్చి చూసి, బిల్లులు విక్రయ రికార్డులను ధరల బోర్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. డీలర్లను హెూల్డింగ్, బ్లాక్ మార్కెటింగ్, కృత్రిమ కొరత సృష్టించే చర్యలపై కచ్చితంగా జాగ్రత్తలను పాటించాలన్నారు. ఎరువుల లభ్యత, ధరలు, వాటి సేవలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

పంట నమోదు ప్రక్రియ పరిశీలన

విశాలాంధ్ర-ధర్మవరం : మండల పరిధిలోని పోతుకుంట గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మానాయక్ పరిశీలించారు. అందుబాటులో ఉండి పంట నమోదు కార్యక్రమాన్ని గడువు లోపల పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు తాము సాగు చేసిన పంటలను నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. అలాగే పట్టణంలోని కోరమండల్ ఎరువు దుకాణాన్ని తనిఖీ చేశారు. తదుపరి లైసెన్సులు అనుమతి పత్రాలు ఇన్వాయిసులు పరిశీలించారు. ఎరువుల ధరల పట్టిక ప్రతిరోజు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ముస్తఫా, తాసిల్దార్ సురేష్ బాబు, సిఎస్డిటి పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులకు పెన్షను అందించండి

విశాలాంధ్ర-ధర్మవరం: అర్హులైన దివ్యాంగులకు పెన్షన్ను అందించాలని శ్రీ సాయి ధర్మాంబా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు లలిత కార్యదర్శి నాగార్జునలు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంగా దివ్యాంగుల సర్టిఫికెట్స్ రీ వెరిఫికేషన్ పూర్తి చేశారని, అందులో అర్హులైన దివ్యాంగులు కూడా ఉన్నారని, వారికి పెన్షన్లు యధా విధంగా పంపిణీ చేయాలని కోరగా కమిషనర్ విచారణ జరిపి వికలాంగులకు న్యాయం చేస్తానని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అనిత, లావణ్య ,లీలావతి, నాగేష్, పర్వీనా, అనిల్, ప్రేమలత, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ ఆహార ధాన్యాలతో ఆరోగ్యం

విశాలాంధ్ర-పుట్టపర్తి: సేంద్రీయ పద్ధతుల్లో పండించిన కూరగాయలు ఆహార ధాన్యాల వల్ల ఆరోగ్యంగా ఉంటామని సేల్స్ మేనేజర్లు రాజశేఖర్, కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆంజనేయ స్వామి దేవాలయంలో టింబక్టు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ వంటకాల ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. స్వయంగా వంటలు వండి పుట్టపర్తి వాసులకు వడ్డించారు. టింబక్టు ఆధ్వర్యంలో సేంద్రీయ పద్ధతుల్లో పండించిన ఆహార ధాన్యాలను అమ్మకానికి ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేంద్రీయ వంటకాలను అలవర్చుకోవాలన్నారు. తాతల కాలం నాటి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం వల్ల భూమి సారవంతంగా మారుతుందని.. విత్తనాలను రైతులకు మేమే అందించడమే కాకుండా ఏ విధమైన మెళకువలు తెలుపుతామని. దిగుబడి పంటను కూడా మేమే కొనుగోలు చేస్తామన్నారు. ముఖ్యంగా చిరుధాన్యాలను రైతుల వద్ద మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టింబర్ ఆర్గానిక్ సిబ్బంది మోహన్ రెడ్డి, శంకర్, కవిత పాల్గొన్నారు.

ఆర్‌డీటీ సేవలను పునరుద్ధరించాలి..

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డిటి సంస్థ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, సామాజిక సేవలు కొనసాగేందుకు ఎఫ్.సి.ఆర్.ఏ. సేవలను పునరుద్ధరించాలని శుక్రవారం వివిధ గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం నాయకులు మాటాడుతూ.. పేదల కోసం ఆర్‌డీటీ సంస్థ విద్య, వైద్యంతో పాటు అన్ని రంగాల్లో సేవలందిస్తున్నదన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అలాగే ఇటీవల తొలగించిన దివ్యాంగుల పెన్షన్లను మళ్లీ పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నిజాం, ప్రజలు, దివ్యాంగుల సంఘం నాయకులు గంగా భవాని పాల్గొన్నారు.

ప్రగతి స్కాలర్‌షిప్స్ పంపిణీ..

విశాలాంధ్ర-రొద్దం: ప్రముఖ బహుళజాతి పురుగు మందుల కంపెనీ బయో స్టాడ్ ఇండియా లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ప్రతిభ కనబరచిన తురుకులాపట్నం జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులకు, బయోజైమ్ ప్రగతి స్కాలర్షిప్స్ అందించారు. ఒక్కొక్కరికి రూ.2500చొప్పున 10 మంది విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయులు వెంగన్న, ఉపాధ్యాయులు,శ్రీ సాయి సీడ్స్ ఏజెన్సీస్ సుగుణాకర్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు ఏఎస్ఎం సుబ్బారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ సదాశివారెడ్డి పాల్గొన్నారు.

చిరంజీవి జన్మదినం సందర్భంగా మెగా రక్త శిబిరం ..

విశాలాంధ్ర-గుడిబండ: మండల కేంద్రంలో చలనచిత్ర నటుడు మెగాస్టార్ చిరంజీవి 70 వ జన్మదిన సందర్భంగా గుడిబండ మండల చిరంజీవి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో మండలంలోని 70 మంది యువకులు రక్తదానం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి అభిమాన సంఘం నాయకులు మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా మెగాస్టార్ చిరంజీవి ఆశయాల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా గుడిబండ ఏఎస్సైలు రమణ,చంద్రశేఖర్ రక్తదానం చేసిన యువకులను అభినందించారు.

చిరుత దాడిలో మేక మృతి ..

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని చిగుతుర్పి గ్రామంలో గురువారం రాత్రి చిరుత దాడిలో రంగనాథ్‌కు చెందిన మేక మృతి చెందింది. ఈ విషయాన్ని మడకశిర అటవీశాఖ అధికారి చాంప్లా నాయక్ సమాచారం అందించారు వెంటనే చిగుతుర్పి గ్రామానికి వచ్చి మృతి చెందిన మేకకు వెటర్నరీ అధికారి శ్రీనివాసులు పోస్టుమార్టం నిర్వహించారు.మేక విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని మేకల కాపరి రంగనాథ్ తెలిపారు. చిరుత దాడిలో మృతి చెందిన మేకకు పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పద్మావతి, వీఆర్వో రాదామణి, సర్పంచ్ శివ రుద్రమ్మ హనుమంతరాయప్ప, టిడిపి నాయకుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు బిల్లులు చెల్లించాలి..

లేనిపక్షంలో కూలీలతో కలిసి ఆందోళనలు చేస్తాం

సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు

విశాలాంధ్ర-ముదిగుబ్బ : ఉపాధి హామీ పథకంలో పనిచేసిన మండలంలోని కూలీలకు బకాయి పడ్డ బిల్లులను తక్షణమే చెల్లించాలని లేనిపక్షంలో కూలీలతో కలిసి త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని సీపీఐ పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, కూలీలకు గత రెండు నెలలుగా ఒక పైసా కూడా బిల్లులు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మండలంలో స్థానికంగా నాయకుల మధ్య వర్గ విభేదాల నేపథ్యంలో ఒకటి రెండు పంచాయతీలు మినహా మిగిలిన అన్ని గ్రామాల్లోనూ గత రెండు మూడు నెలలు కిందటి వరకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించలేదన్నారు. ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో పాటు టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీరామ్ కూడా ఈ మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుల నియామకానికి శ్రద్ధ చూపకపోవడంతో ఉపాధి పనులు లేక తీవ్ర ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు, దీంతో గత ఏడాదిగా మండలంలో ఉపాధి హామీ పథకం పనులు స్తంభించిపోయాయన్నారు. రైతులు పండ్ల తోటలు పెంచుకోవడానికి కూడా అవకాశాలు లేకుండా పోయిందని విచారణ వ్యక్తం చేశారు, ఈ మేరకు ఎట్టకేలకు మండల వ్యాప్తంగా గత రెండు నెలల నుంచి ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించడంతో సంతోషంతో కూలీలు పనులకు వెళ్తున్న నేపథ్యంలో గోరుచుట్టుపై రోకటి పోటులా బిల్లులు చెల్లించకపోవడంతో కూలీల ఆవేదనకు అంతులేకుండా పోతుందని సిపిఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు, కనుక తక్షణమే ఉపాధి కూలీలకు బకాయి బిల్లులు మంజూరు చేయాలని లేకుంటే ఆందోళనలు తప్పదని హెచ్చరించారు.

గంజాయి రవాణా చేస్తున్న ఆరుగురు నిందితుల అరెస్టు..

విశాలాంధ్ర-కదిరి టౌన్: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ విద్యార్థులు, యువకులను లక్ష్యంగా చేసుకొని సొమ్ము చేసుకొంటున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. కదిరి రూరల్ మండలం కొండమనాయిని పాలెం వద్ద కదిరి రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో మాటు వేసి మంగళవారం రాత్రి గంజాయి రవాణా ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. గంజాయి ని కదిరికి రతలిస్తున్న 6 మంది యువకులు అరెస్ట్ చేసి వారి నుండి పది కేజీల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు కదిరి డిఎస్పీ శివనారాయణ స్వామి పేర్కొన్నారు. రూరల్ అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కొండమనాయుని పాళ్యం గ్రామ సచివాలయం వెనుక గల గుట్ట వద్ద గంజాయిని అక్రమ రవాణా, విక్రయం గురించి ఖచ్చితమైన సమాచారం రావడంతో ఆకస్మికంగా తనిఖీ చేయడమైనదన్నారు.

పట్టుపడ్డ వారిలో కదిరి పట్టణానికి చెందిన అజాజ్ అనే వ్యక్తి గంజాయిని మహారాష్ట్రలోని జల్గామ్ జిల్లా, పైజాపూర్ లోని వాటర్ టాంక్ ఏరియా లీగల రాజు అనే వ్యక్తి నుండి కొనుగోలు చేసి, ఈ ప్రాంతానికి రవాణా చేస్తున్నట్లు తెలిపారు. రైలులో తీసుకొని వచ్చి తన స్నిహితులైన సోయబ్, అర్ఫాన్, మహమ్మద్ హుస్సేన్, అస్లాం, గౌస్ బాష లతో కలిసి కదిరి పట్టణంలో చిన్న చిన్న ప్యాకెట్లలో రూ.200ల నుండి రూ.500లకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు డియస్పీ ప్రకటించారు. అరెస్టు చేసిన నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. జి.అజాజ్ (25 సం.) కదిరి టౌన్, జామియా వీధి. నల్లమాడ షోయబ్ (26), కదిరి టౌన్, నాగరాజు వీధి.

షిక్ ఆర్ఫాన్ (21), కదిరి టౌన్, గాంధీ నగర్, షేక్ మహమ్మద్ హుస్సైన్ (23), కదిరి టౌన్, జామియా మసీద్ వీధి, షిగ్ అస్లామ్ (19) కదిరి టౌన్, అమీన్‌నగర్. యన్.గౌస్ బాష (20), కదిరి టౌన్, ఖాజా నగర్, గంజాయి వంటి నిషేదిత పదార్థాల వినియోగం, రవాణా, విక్రయం చట్టవిరుద్ధమని, ఇటువంటి కార్యకలాపాలను నిరోదించడానికి పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏదైనా గంజాయిని గురించిన సమాచారం తెలిసినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పింఛన్ క్రమబద్ధీకరణ పేరుతో కడుపు కొట్టొద్దు సారూ..

దివ్యాంగులుగా పుట్టడమే మేము చేసిన పాపమా?

విశాలాంధ్ర-కదిరి : పెన్షన్ క్రమబద్ధీకరణ పేరుతో మా కడుపు కొట్టొద్దు సారు అంటూ వికలాంగులు అధికారులను వేడుకొంటున్నారు. కదిరి మున్సిపాలిటీ పార్థసారథి కాలనికి చెందిన రంగప్ప కండరాల బలహీనతతో (85శాతం) అంగవైకల్యం, జహీర్‌బి పుట్టుకతో మూగ, చెవిటి (85శాతం), అంగవైకల్యం, కె.అంజనమ్మ పక్షవాతంతో రెండు కాళ్ళు పని చెయ్యని స్థితిలో (85 అంగవైకల్యం) ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించి సదరం సర్టిఫికెట్లు మంజూరు చేసి ప్రతి నెల రూ.15వేలు పెన్షన్ తీసుకునేవారు. అన్ని అర్హతలు ఉన్న ప్రస్తుతం 85శాతం ఉన్న అంగవైకల్యాన్ని 70 శాతానికి తగ్గించి రూ.6వేలు ఇస్తామంటూ నోటీసులు జారీ చేశారని కన్నీటి పర్యంతం అయ్యారు. పెన్షన్

క్రమబద్ధీకరణ పేరుతో కడుపుకొట్టదంటూ అధికారులను వేడుకొంటున్నారు.

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల పరిధిలోని ధనియానిచెరువు గ్రామానికి చెందిన వల్లెపు మునెప్ప(59)గురువారం రాత్రి క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతని కుటుంబసభ్యులు గమనించి హుటాహుటిన కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుఝామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మహేష్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

విశాలాంధ్ర-కొత్తచెరువు: సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సెప్టెంబర్ 5వ తేదీ సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఈనెల 31వ తేదీ ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు సోమశేఖర్, జైచంద్ర తెలిపారు. క్రీడలు క్రికెట్, కబాడీ, సెటిల్, చెస్, పరుగు పందెం100 మీటర్స్, మహిళలకు టెన్నికాయిట్, త్రో బాల్, చెస్, పరుగు పందెం 50 మీటర్ల పోటీని నిర్వహిస్తామని.. ఆసక్తి గల ఉపాధ్యాయులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పాఠశాలకు చిత్రపటాల అందజేత..

విశాలాంధ్ర-ఓడిసిరూరల్ : కొండకమర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐట విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పుట్టపర్తి తొలి మహిళా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చిత్రపటాలను ప్రధానోపాధ్యాయులు కృష్ణా నాయక్‌కు తెలుగుదేశం పార్టీ నాయకులు బహుకరించారు. రాజకీయాలలో పదవులు ఎవరికి శాశ్వతం కాదని ప్రజలకు అందించిన మంచి సేవలే శాశ్వతమని అన్నారు, ఈ కార్యక్రమంలో స్కూలు కమిటీ అధ్యక్షులు రవి, టీడీపీ సీనియర్ నాయకుడు జౌళి అల్లా బకాష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు శంకరయ్య,చింతమాను పల్లి లక్ష్మీపతి నాయుడు, సుధాకర్ నాయుడు, రవుఫ్, సాదిక్ వలి పాల్గొన్నారు.

కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొనండి..

విశాలాంధ్ర-బుక్కపట్నం: ఉమ్మడి జిల్లాలోని విద్యార్థిని విద్యార్థులు కళా ఉత్సవ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రవేట్, పాఠశాలలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని, ఈ పోటీలు సెప్టెంబర్ 11, 12 వ తేదీలలో బుక్కపట్నం డైట్ కళాశాలలో 9 సాంస్కృతిక విభాగాలలో పోటీలు నిర్వహించబడతాయని విజేలతకు అక్టోబర్ 23, 24 వ తేదీ తేదీలలో జరుగు రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ 2025 పోటీలలో పాల్గొనడానికి అర్హులన్నారు. మరిన్ని వివరాలకు డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ 9949993712, శ్రీధర్ 7981776864ను సంప్రదించాలన్నారు.

రైతు కూలీలకు రూ. 6 వేలు ఆర్థిక సాయం అందించిన సినీ నటుడు మంచు మనోజ్ దంపతులు

విశాలాంధ్ర-అమరాపురం: అమరాపురం మండలం హేమావతి గ్రామంలో య ంజేరు సిద్దేశ్వర స్వామి ఆలయానికి దైవ దర్శనానికి వెళ్లి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో గునేహళ్లి గ్రామం సమీపంలో రోడ్డు పక్కనే పత్తి పంటలో పనిచేస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి సినీ నటుడు మంచు మనోజ్ దంపతులు మౌనికరెడ్డి మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఉమాదేవి లు వెళ్లి కూలీలను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకొన్నారు. రోజూ మీకు కూలి ఎంత ఇస్తున్నారంటూ వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. వారికి వెంటనే రూ.6 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కూలీలు ఒకరిపై ఒకరు ఎగబడి వారితో సెల్ఫీలు తీసుకున్నారు. వీరి వెంట ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి తహసీల్దారుకు సన్మానం

విశాలాంధ్ర-లేపాక్షి: ప్రజా సమస్యల పట్ల బాధ్యతగా పరిష్కరించిన లేపాక్షి తహసిల్దార్ సౌజన్య లక్ష్మిని శుక్రవారం ఉదయం కార్యాలయంలో వైసీపీ జిల్లా విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి నాగభూషణం ఘనంగా సన్మానించారు. అనంతరం నాగభూషణం మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రి చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రం అందుకోవడం మండలానికి మంచి గౌరవమని భవిష్యత్తులో మరింత బాధ్యతగా విధులు నిర్వహించే ప్రజలకు అండగా ఉండాలని ఆకాంక్షించారు.

దివ్యాంగుల పెన్షన్‌లో అర్హులకు టోకరా

విశాలాంధ్ర-నంబులపూలకుంట : మండల పరిధిలోని 10 గ్రామ సచివాలయాల పరిధిలో 168 దివ్యాంగుల పెన్షన్లను తొలగించి వారికి సచివాలయ సిబ్బంది నోటీసులు అందజేశారు. కానీ అర్హులం అయినప్పటికీ తమకు నోటీసులు జారీ చేసి పెన్షన్ తొలగించారని దివ్యాంగులు ఆవేదన చెందుతున్నారు. తూర్పు నడింపల్లి పంచాయతీ ఆసంవారిపల్లి గ్రామానికి చెందిన పంది బోటి వెంకటరమణ పుట్టుకతోనే రెండు కాళ్ళు కోల్పోయానని, మలమూత్రాదులు సైతం కూర్చున్న చోటే విసర్జిస్తున్నానని తెలిపాడు. అతను రూ.15000 పెన్షన్ కి అర్హుడైనప్పటికీ వికలాంగుల పెన్షన్ రూ 6000 ఇస్తున్నారని వాపోయాడు. తనకి కూడా పెన్షన్ తొలగిస్తున్నట్లు నోటీసులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. టిఎస్ కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆసం సాలెమ్మ పుట్టుకతోనే మరుగుజ్జుతో పుట్టారని, తలలో పుర్రె సమస్యతో బాధపడుతూ కనీసం తన పనులు కూడా చేసుకోలేక పోతున్నదని, రూ 200 ఉన్నప్పటి నుండి పెన్షన్ తీసుకుంటున్నదని కుటుంబ సభ్యులు తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక అక్రమంగా పెన్షన్ పొందుతున్నారని పెన్షన్ తొలగిస్తున్నట్లు నోటీసులు జారీ చేశారన్నారు. అనర్హులైనప్పటికీ కొంతమంది డాక్టర్ల నుండి దొంగ సదరం సర్టిఫికెట్లు పొంది నేటికీ డీఎంహెచ్వో,వికలాంగుల అక్రమ పెన్షన్ పొందుతున్నారు. అర్హులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మారమ్మ దేవతకు శ్రావణమాసం పూజలు

విశాలాంధ్ర - అగళి: స్థానిక మారమ్మ దేవాలయంలో శ్రావణమాసపు చివరి శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు నాగరాజు తెలిపారు. ప్రాతః కాల సమయం వేకువ జాము నుండి అమ్మ వారికి వివిధ అభిషేకాలు నిర్వహించి, అమ్మవారికి గాజులు వస్త్రాభరణాలు ధరింపజేసి వివిధ రకాల పూలు పూల మాలలతో ప్రత్యేక అలంకరణ,చేసి నైవేద్యం సమర్పించి కుంకుమార్చనలు సహస్రనామార్చనలు చేసి మహా మంగళ హారతి,తీర్థ ప్రసాద వినియోగం గావించారు. చివరి శుక్రవారం కావడంతో భక్తులు విశేషంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పెరుగన్నం పాయసం నివేదించారు. మంగళ శుక్రవారాల్లో దేవత పూజలు నిర్వహించి పిల్లలు తాయత్తులు వేయించు కుంటే భయభ్రాంతులు కలగకుండా సమస్త రోగాలు నయమవుతాయని భక్తుల నమ్మకం

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 23, ఆగస్టు 2025

ఓటు నమోదు మార్పులు చేర్పులపై రాజకీయ నేతలతో సమావేశం

విశాలాంధ్ర–పెనుకొండ: సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీవో ఆనంద్ కుమార్ అధ్యక్షతన పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయాల పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని. ఓటరు జాబితాలో మార్పులు, తొలగింపులు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ గురించి ప్రజాప్రతినిధులతో చర్చించారు. అలాగే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్స్‌ను నియమించుకోవాలని తెలిపారు. సమావేశానికి నియోజకవర్గంలోని ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది రాజకీయ పార్టీ ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

ఉపాధి పనుల బిల్లులు చెల్లించాలి

విశాలాంధ్ర–గుడిబండ : ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని కూలీలకు బకాయి పడ్డ బిల్లులను తక్షణమే చెల్లించాలని లేనిపక్షంలో కూలీలందరూ కలిసి త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని కూలీలు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలకు గత రెండు నెలలుగా ఒక పైసా కూడా బిల్లులు చెల్లించక పోవడంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు, తక్షణమే ప్రభుత్వం మండలం లో ఉపాధి కూలీలకు బకాయి పడ్డ రెండు నెలల బిల్లులు మంజూరు చేయాలన్నారు, కార్యక్రమంలో ఉపాధి కూలీలు మల్లికార్జున, శేఖర్, గుజ్జారప్ప, వీరేష్, హనుమేష్, పాండురంగప్ప, నరసింహప్ప, చంద్రప్ప, పార్వతమ్మ, లలితమ్మ, పొట్టమ్మ తెలిపారు.

నేడు గూగూడులో చక్కెర వేలం

విశాలాంధ్ర–నార్పల : మండలంలోని గూగూడు కుళ్లాయి స్వామి ఆలయ ఆవరణలో శనివారం ఉదయం 9 గంటలకు 5 వేల కిలోల చక్కెరను వేలం వేస్తున్నట్లు ఈవో సాకేతపురం శోభ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణుని ప్రతిమ ఊరేగింపు

విశాలాంధ్ర–కొత్తచెరువు: ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ప్రతిమ ఊరేగింపు వేడుకలు కొత్త చెరువులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని జన్మదినం సందర్భంగా పుట్టపర్తి రోడ్డులో బాలికల హాస్టల్ వద్ద వారం రోజులపాటు అక్కడ పూజలు నిర్వహించారు. ఈరోజు గ్రామంలో వందలాదిమంది భక్తులతో పురవీధుల గుండా సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగించారు. కార్యక్రమంలో ప్రబోధానంద సేవా సమితి కమిటీ వారు నాగేంద్ర, అక్కమ్మ, శాంతి, కల్పన, సాయినాథ్, లలిత, పద్మావతి, పెద్దక్క, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర–కొత్తచెరువు: నిబంధనలకు అధికమించి ఎరువులు క్రిమిసంహార మందులు అమ్మకాలు చేపడితే అలాంటి దుకాణాలపై కఠిన చర్యలు తప్పవని. పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ తెలిపారు. కొత్తచెరువులో శుక్రవారం మన గ్రోమోర్, ఈశ్వర్ ఏజెన్సీలో తనిఖీలు నిర్వహించి రైతులకు ఎన్ని బస్తాలు ఇస్తున్నారని ఆరా తీశారు. ఎరువులను అధిక బస్తాలు ఇవ్వకుండా ప్రతి రైతుకు తగిన మోతాదులో ఇవ్వాలని సూచించారు. ఏవో సతీష్ బాబు, ఆర్ఐ కిరణ్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగు చేసిన రైతులకు మాత్రమే యూరియా అందించాలి..

విశాలాంధ్ర–బుక్కపట్నం : పంట సాగు చేసిన రైతులకు మాత్రమే సబ్సిడీ యూరియాను సరఫరా చేయాలని ఇన్చార్జి తహసిల్దార్ నరసింహులు, వ్యవసాయ అధికారి సతీష్ బాబులు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయసహకార సంఘ సొసైటీని తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలను పరిశీలించారు. సాగు చేసిన రైతులకు మాత్రమే యూరియాను పంపిణీ చేయాలని, ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి ప్రవేట్ డీలర్లు, సొసైటీ డీలర్లు రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లిరెడ్డి, కురవ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు..

విశాలాంధ్ర–బుక్కపట్నం: పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో చిరంజీవి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తేరు కూడలిలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ సినీ చరిత్రలో మకుటం లేని మహారాజుగా వెలుగుతూ, స్వశక్తితో అంచలంచెలుగా ఎదిగి అభిమానులు ప్రత్యేకతను చాటుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర–గుడిబండ : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎం.జె ల్.పి జూనియర్ కళాశాలలో గతంలో చదివిన విద్యార్థులు తేజ, చంద్రశేఖర్ శ్రీనివాస్ గోపాలకృష్ణ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడుతూ తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు ప్రాముఖ్యత కల్పించి వారి శ్రమను గుర్తుంచుకొని అనేక విషయాలు నేర్చుకున్న విద్యార్థినీలు తల్లిదండ్రుల కష్టాలపై కథలు రూపంలో అనేకమైన విషయాలను ప్రేరణ ఉత్సాహాన్ని నింపడంతో పాటు సామాజిక సంస్కర్త గురించి విద్యార్థుల వికాసానికి క్రమశిక్షణ విధులు బాధ్యతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

విశాలాంధ్ర–ధర్మవరం: వినాయక పండుగను పట్టణములోని ప్రజలు శాంతియుతంగా నిర్వహించాలని, అదేవిధంగా విగ్రహాలను ఏర్పాటు చేసే వారు కూడా శాంతియుతంగా నిర్వహించుకోవాలని టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. శుక్రవారం టూటౌన్ పోలీస్ స్టేషన్లో వినాయక విగ్రహాలను నిర్వహించే నిర్వాహకులతో వారు సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ వినాయక పండుగ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అదేవిధంగా వినాయక ఏర్పాటుకు వివిధ ప్రభుత్వ కార్యాలయాల ద్వారా తప్పనిసరిగా అనుమతి పొందాలని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది, వినాయక మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలకు కదలిన ఎర్రదండు

విశాలాంధ్ర–బ్యూరో అనంతపురం: సిపిఐ రాష్ట్ర మహాసభలు శనివారం నుండి ఒంగోలు నగరంలో ప్రారంభమవుతున్న సందర్భంగా అనంతపురం జిల్లా నుండి వందలాది మంది రెడ్ షర్ట్స్ ఎర్రదండు సైన్యం శుక్రవారం బయలుదేరారు. జిల్లా వ్యాప్తంగా రాత్రికి సీపీఐ కార్యకర్తలు, అన్ని అనుబంధ సంఘాల సభ్యులు అనంతపురం చెరువు కట్ట వద్దకు చేరుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి వందలాది మంది సిపిఐ కార్యకర్తల నినాదాల మధ్య ఎర్ర జెండా ఊపి బస్సుల ర్యాలీని ప్రారంభించారు., అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర మహాసభలు శనివారం నుండి ప్రారంభమవుతున్న సందర్భంగా జిల్లా నలుమూలల నుండి ప్రతినిధులు,వందలాది మంది రెడ్ షర్ట్స్ వాలంటీర్లు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా తరలివెళ్ళడం జరుగుతుందని ఇదే ఉత్సాహంతో సీపీఐ చేపట్టే ప్రజా సమస్యలపై కూడా ఉత్సాహము కనబర్చా లని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం సీపీఐ నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తలారి నారాయణస్వామి, ఎ.పద్మావతి జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రమణయ్య సంతోష్‌కుమార్, శ్రీశైలం రాజేష్‌గౌడ్, ఈ.కుల్లాయి స్వామి, రాప్తాడు నియోజక వర్గ సహాయ కార్యదర్శి నీళ్లపాల్ల రామకృష్ణ, బుక్కరాయ సముద్రం మండల కార్యదర్శి బండి రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంత రాయుడు, నగర సిపిఐ సహాయ కార్యదర్శి వి.కృష్ణుడు, అనంతపురం నగర కార్యవర్గ సభ్యులు మున్నా, చిత్రచేడు రామాంజనేయులు, అల్లీపీరా, రైతు సంఘం నాయకులు పబలకుంట వన్నారెడ్డిలు వందలాది మంది రెడ్ షర్ట్ వాలంటీర్లు, అనంతపురం రాప్తాడు, సింగనమల సిపిఐ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు.

నూతన ఉపాధ్యాయ క్యాంటీన్ ప్రారంభించిన మంత్రి సవిత

విశాలాంధ్ర–పెనుకొండ: పెనుకొండ పట్టణ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పులగూర్ల శ్రీనివాసులు ఉపాధ్య క్యాంటీన్‌ను శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ప్రారంభించారు. ఆమె వెంట ఎంపీ పార్థసారథి, బిజెపి జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్, స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టలో మంత్రి సవిత

విశాలాంధ్ర–పెనుకొండ: మండల పరిధిలోని వెంకటగిరిపాళ్యం గ్రామం నందు శుక్రవారం యల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకమైన పూజలు నిర్వహించిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ ఈ విగ్రహ ప్రతిష్టకు మంత్రి ఆర్థిక సహాయం అందజేశారు ,అలాగే వేదపండితులకు సమక్షంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, దేవాలయాన్ని మరల పునరుద్ధరణ కార్యక్రమం గ్రామస్తులు నిర్వహించారు, అనంతరం గ్రామంలో జరుగుతున్న జలజీవన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులను కార్యకర్తలతో కలిసి పర్యవేక్షించారు, మంత్రి సవితమ్మకు దేవాలయ ట్రస్ట్ వారు ఘనంగా సన్మానం చేశారు, అలాగే ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు పార్థసారథి కూడా పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త, ఎంపీపీల మధ్య ఘర్షణ

విశాలాంధ్ర–చిలమత్తూరు: మండల పరిధిలోని వీరాపురం పంచాయతీ హుస్సేన్ పురం గ్రామంలో శుక్రవారం ఆ గ్రామ వాసి శివ, టిడిపి నాయకుడు వేణు రెడ్డి, ఎంపీపీ పురుషోత్తం రెడ్డి ఇరువురి మధ్య ఘర్షణ చేసుకొని ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డారు, శివ, బాబు రెడ్డి అను ఇరువురు పొలం నుండి వస్తుండగా ఎంపీపీ పురుషోత్తం రెడ్డి మార్గమధ్యలో, శివ కుటుంబీకులపై దూషించడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది దీన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించగా నీతో పనిలేదు నీతో ఎప్పుడో ఎలిమినేట్ చేయాలని చూసాము, ఇంకోసారి మాపై వస్తే ఏదో ఒకటి చేసేస్తామని ఎంపీపీ అన్నారని, అతనితో నాకు ప్రాణహాని ఉందని టిడిపి కార్యకర్త వేణు రెడ్డి విలేకరుల సమావేశంలో చెప్పారు, దీంతో రెచ్చిపోయిన ఇరువురు ఆసుపత్రి పాలయ్యారు ఈ నేపథ్యంలో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, జడ్పిటిసి మామ నాగరాజు యాదవ్, తదితరులు మాట్లాడుతూ కార్యకర్తల జోలికి వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన తీర్పుకు కట్టుబడి ఉన్న మాపై బురద చల్లే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదు, గత ఎమ్మెల్యే ఎన్నికలలో రౌడీ ముక్కలను గుండాలను వేసుకొని అదే హుస్సేన్ పురంలో అల్లరు చేసి రక్త గాయాలు చేసింది ఎవరో అందరికీ తెలుసని గుర్తు చేశారు. ఎమ్మెల్యే బాలయ్య నాయకులను కార్యకర్తలను ఏకతాటిపై నడిపిస్తూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తుంటే, ఓర్వలేక నీచ రాజకీయాలు చేయడమేంటని తగదని హితవు పలికారు.

యంజేరు సిద్దేశ్వర స్వామి సన్నిధిలో సినీ హీరో మంచు మనోజ్ దంపతులు

విశాలాంధ్ర–అమరాపురం : మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన దేశంలోనే ప్రసిద్ధిగాంచిన శ్రీ యంజేరు సిద్దేశ్వర స్వామికి సినీ నటుడు మంచు మనోజ్ దంపతులు మౌనిక రెడ్డి అదేవిధంగా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు దంపతులు ఉమాదేవిలు కుటుంబ సమేతంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారిని ఆలయంలోకి ఆహ్వానించి స్వాగతం పలికారు. మంచు మనోజ్ దంపతులకు ఎమ్మెల్యే దంపతులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు. వారు అర్చకుల నుండి ఆశీస్సులు తీసుకున్న అనంతరం మంచు మనోజ్ దంపతులు ఎమ్మెల్యే దంపతులు యంజేరుసిద్దేశ్వర స్వామి ఆలయానికి ఉన్న చరిత్రను ఆలయ అర్చకులను అడిగి తెలుసుకున్నారు. రాజుల కాలంలో రాజులు ఈ ఆలయాన్ని పరిపాలించిన విధి విధానాలను ఆలయానికి ఉన్న విశిష్టతను అర్చకులను అడిగి తెలుసుకోవడంతో పాటు ఆలయంలో ఉన్న నంది విగ్రహాన్ని దేవాలయంలో ఉన్న శివలింగాలని వారు పరిశీలించారు. అదేవిధంగా ఆలయంలో ఉన్న కొలనును వారు పరిశీలించి కొలనులో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల నుండి మండల కన్వీనర్లు అమరాపురం మండలం టిడిపి కన్వీనర్ కృష్ణమూర్తి ,సింగల్ విండో అధ్యక్షులు గణేష్ ,మాజీ జెడ్పీటీసీ సభ్యులు నరసింహమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్, తిప్పజ్జ, తిమ్మన్న, మాజీ సర్పంచ్ కుమారస్వామి, ఎంపీటీసీ ఓంకార స్వామి, రామచంద్రప్ప, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, మైనార్టీ అధ్యక్షులు డైరెక్టర్ దాదు, ప్రసాద్, మడకశిర నియోజకవర్గం ఎస్సీసెల్ అధ్యక్షులు జయకుమార్, నాగోవనహళ్లి మంజునాథ్, వలస పంచాయతీ కన్వీనర్ నాగరాజు, కుమార్, నిద్రగట్ట సర్పంచ్ లోకేష్, తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా పాఠశాలను ఎలా ఏర్పాటు చేస్తారు

- వీటిపై ప్రశ్నిస్తే మా పైనే దాడులు చేస్తారా?
- ఫీనిక్స్ గ్లోబల్ పాఠశాల యాజమాన్యంపై ప్రైవేట్ పాఠశాలల యూనియన్ ఫైర్

విశాలాంధ్ర–బత్తలపల్లి: ప్రభుత్వ అనుమతులు లేకుండా నిబంధనలను తుంగలో తొక్కుతూ నూతన పాఠశాలను ఏర్పాటు చేశారు... ఇదేమని ప్రశ్నిస్తే మా పైనే దాడులు దౌర్జన్యాలకు దిగుతారా అంటూ ఫీనిక్స్ గ్లోబల్ పాఠశాల యాజమాన్యం పై బత్తలపల్లి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఫైర్ అయింది. శుక్రవారం బత్తలపల్లిలో విద్యాధరి, విజేత, విజ్ఞాన భారతి ,జ్యోతి స్కూల్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం అంతా కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పాఠశాల యాజమాన్యం వేధింపుల పై తమ ఆవేదన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలన్నీ తుంగలో తొక్కుతూ ఎటువంటి అనుమతులు లేకుండా బత్తలపల్లి లో ఫీనిక్స్ గ్లోబల్ పాఠశాలను ఏర్పాటు చేశారని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం పేర్కొంది. అనుమతులు లేని విషయాన్ని తాము డిఇఓ, ఎంఈఓ ,జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో మాపై పగబట్టిన గ్లోబల్ పాఠశాల యాజమాన్యం కొంతమంది వ్యక్తులను ఏర్పాటు చేసుకుని మా పాఠశాలలపై దాడులకు పాల్పడుతున్నారని వారు వాపోయారు. కొన్ని సంఘాలను ముందు పెట్టి తమను మానసికంగా ఇబ్బందులు చేస్తున్నారని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఆర్టిఐ పేరుతో మమ్మలను చిత్రహింసలు గురి చేస్తూ మా నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని యాజమాన్యం పేర్కొంది. ఇప్పటికీ అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తూ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని వారు ఆశ్చర్యపన వ్యక్తం చేశారు. సాక్షాత్తు మండల విద్యాధికారి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న గ్లోబల్ పాఠశాలను సీజ్ చేసిన తిరిగి యధావిధిగా కొనసాగిస్తున్నారని వారు పేర్కొన్నారు . బత్తలపల్లి లో ఎన్రోల్ అయినా విద్యార్థులను వేరే జిల్లాలో ఉన్న యూడీసీలో ఎన్రోల్ చేస్తున్నారని అదేవిధంగా ఆ పాఠశాల నడుపుతున్న స్కూల్ బస్సు కూడా నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. గ్లోబల్ స్కూల్ యజమాన్యం నిబంధనలు మేరకు వ్యవహరించకుండా తమ పాఠశాలలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అనుమతులు లేని పాఠశాలలో పిల్లలను చేర్చవద్దని పాఠశాలల యాజమాన్యం విన్నవించింది. ఇప్పటికే గ్లోబల్ పాఠశాలను రెండుసార్లు సీజ్ చేసిన పైరవీలతో తిరిగి పాఠశాల తెరుస్తున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్లోబల్ పాఠశాలకు పూర్తిస్థాయి అనుమతులు లభించే వరకు శాశ్వతంగా మూసివేయాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం కోరారు.

వాల్మీకుల కళ్యాణ మండపానికి స్థలాన్ని కేటాయించండి

విశాలాంధ్ర–ధర్మవరం: ధర్మవరం పట్టణంలో వాల్మీకులకు కళ్యాణ మండపము కొరకు ఒక ఎకరా లేదా 50 సెంట్లు స్థలాన్ని ఇప్పించవలసినదిగా కోరుతూ వాల్మీకి సంఘం నాయకులు బోయ రవిచంద్ర మద్దిలేటి తదితర నాయకులు ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ పట్టణంలో వాల్మీకి సంఘం నాయకులకు కళ్యాణ మండపం లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులతో మా విన్నపాన్ని తెలియజేసి స్థలాన్ని ఇప్పించవలసినదిగా వారు కోరారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా వాల్మీకి సంఘమునకు ఎవరూ ఎటువంటి సహాయ సహకారాలను అందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ మీయొక్క సమస్యను తాసిల్దార్ తోను కమిషనర్ తోను చర్చించి న్యాయం చేస్తానని వారు హామీ ఇచ్చారు. వాల్మీకులకు టిడిపి ఎల్లప్పుడు అండదండలుగా ఉంటుందని తెలిపారు. తదుపరి పరిటాల శ్రీరాములు వాల్మీకి సంఘం నాయకులు ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు చంద్రమోహన్ బాబు సాయి రాజన్న బొట్టు కృష్ణ తోపాటు 100మంది వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో నైపుణ్య కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలి..

మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలి
కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర–అనంతపురం: జిల్లాలో నైపుణ్య కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో స్కిల్ డెవలప్మెంట్ కార్యాలయంలో నిర్వహించిన నైపుణ్య కార్యక్రమంలో అనంతపురం జిల్లా అన్ని జిల్లాల కంటే మెరుగ్గా కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్రంలో ప్రథమ స్థానం పొంది బహుమతి గెలుచుకోవడంతో నైపుణ్యం బహుమతులను జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి తదితరులకు అందజేసి జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాష్ట్రంలో అన్ని జిల్లాల కంటే మెరుగ్గా కార్యక్రమాలు నిర్వహించి ప్రథమ స్థానం పొంది బహుమతి గెలుచుకోవడం సంతోషకరమన్నారు.

మట్టి వినాయక విగ్రహాలను వాడుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

విశాలాంధ్ర–పెనుకొండ : పెనుకొండ శ్రీ షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ శిల్ప ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి వినాయకులు పర్యావరణ పరిరక్షణ అనే కార్యక్రమంపై విద్యార్థులతో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ర్యాలీ నిర్వహించారు, ఈ ర్యాలీని ఆర్డీవో ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. మట్టి వినాయకులను వాడుదాం పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం షిరిడి సాయిబాబా గ్లోబల్ ట్రస్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శిల్ప పాల్గొని ప్రసంగించారు. రాబోయే వినాయక చవితికి అందరూ మట్టి వినాయకులని వాడాలని మన సాంప్రదాయ సాంస్కృతిక అంశాలను రాను రాను మర్చిపోతున్నామని వాటిని మర్చిపోకుండా భవిష్యత్ తరాలకు అందించడం మన బాధ్యత అని తెలుపుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన వినాయకుల నిమజ్జనంలో వాడే రంగులు ప్రతి ప్రమాదకరమని వాటి వలన అనేక దుష్ఫలితాలు వస్తాయన్నారు. వాటిని వాడకుండా జాగ్రత్తగా పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. మన మట్టి, మన నీరు, మన పర్యావరణంపై విద్యార్థులకు వ్యాసరచన వక్తృత పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు, షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ ద్వారా ప్రతి ఏడాది ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి కంటి చికిత్సలు అలాగే వినికిడి లోపం ఉన్నవారికి జపాన్ దేశం నుంచి మంచి వినికిడి పరికరాలు తెప్పించి లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం, గర్భవతులకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు.

24న ఉచిత వైద్య చికిత్స శిబిరం

విశాలాంధ్ర–ధర్మవరం: పట్టణంలోని తొగటవీధిలో గల శ్రీ శాంత కళ చౌడేశ్వరి దేవి ఆలయములో ఈనెల 24వ తేదీ ఆదివారం ఉదయం పదిగంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే 114వ ఉచిత వైద్య చికిత్స శిబిరం సద్వినియోగం చేసుకోవాలని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ అభివృద్ధి సంఘం కమిటీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరంలో నిష్ణాతులైన, అనుభవజ్ఞులైన డాక్టర్. వివేక్ కుల్లాయప్ప(దంత వైద్యులు), డాక్టర్ వెంకటేశ్వర్లు(చిన్నపిల్లల వైద్యులు), డాక్టర్ జై దీపునేత (గ్యాస్ట్రో అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ హైదరాబాద్), డాక్టర్. సతీష్ కుమార్(ఎముకల వైద్య నిపుణులు), డాక్టర్. విట్టల్,(దంత వైద్యులు) డాక్టర్ ప్రణయ్(జనరల్ నిపుణులు) వారు రోగులకు వైద్య చికిత్సలను అందించి ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు కూడా వివరిస్తారని తెలిపారు. శిబిర దాతలుగా కీర్తిశేషులు రెడ్డిపల్లి సుబ్బమ్మ, రెడ్డిపల్లి రామప్ప జ్ఞాపకార్థం వీరి కుమారుడు రామచంద్ర, సాయి మనోజ్, రాజేశ్వరి వ్యవహరిస్తారని తెలిపారు. ఉచిత వైద్య చికిత్సతో పాటు నెలకు సరిపడు మందులను కూడా ఉచితంగా ఇవ్వబడుతుందని తెలిపారు. బిపి, షుగర్ పరీక్షలు నిర్వహిస్తూ వైద్య చికిత్సలు కూడా అందిస్తామని తెలిపారు. కావున పేద ప్రజలందరూ కూడా ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తప్పక వ్యవహరించాలని, అప్పుడే ఆరోగ్యం కుదుటపడుతుందని తెలిపారు.

చిన్నారులకు టీకాలే సరైన ఆరోగ్య రక్ష

విశాలాంధ్ర–ధర్మవరం: చిన్నారులకు టీకాలే సరి అయిన ఆరోగ్య రక్షక ఉంటాయని ఋషి విద్యాలయ హెడ్మాస్టర్ కరణ్ స్వరూప సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలకు ఆశా వర్కర్లు ఆరోగ్య కార్యకర్తల ఆధ్వర్యంలో చిన్నారులకు డిటిడి టీకాలను వేశారు. భవిష్యత్తులో పిల్లల ఆరోగ్యం కాపాడుటకు రోగనిరోధక శక్తి పెంపొందించుటకు ఈ టీకాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ భాస్కర్ రెడ్డి, సీఈఓ రవీంద్ర, ఏవో రంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.